**కథ**

*బ్రతుకికి- చావుకి మధ్య ఎంతదూరం? అని ఎవరైనా అడిగితే 'వెంట్రుకవాసంత' దూరం అని చెబుతాను నేను. ఇప్పుడు నేను బ్రతుకికి- చావుకి మధ్యన సన్నటి సరళరేఖ మీద నిలబడి వున్నానేమో అనిపిస్తుంది నాకు.*

# ఆకాశ వీధిలో

కార్గిల్ మంచుకొండల్లో పాయింట్ 5240 శిఖరం అది. 17,300 అడుగుల ఎత్తైన ఆ శిఖరం మీద ఆరు అడుగుల పొడవు, ఆరు అడుగుల వెడల్పు. ఉక్కు పలకలతో పై కప్పు, ఇసుక బస్తాలతో గోడలు కట్టిన బంకర్ అది.

కిరోసిన్ స్టవ్ మీద టీ కాగుతోంది. దాని చుట్టూ కూర్చొని వున్నారు సైనికులంతా. స్టవ్ నుండి వెలువడుతున్న పొగతో... చలి నుండి రక్షణ కోసం మంచుకొండల్లో ధరించే పదహారు భాగాల తెల్లని యూనిఫాం మసిబారుతున్నాయి. అయినా అదంతా ఎవరూ పట్టించుకోవటం లేదు. మాసిన గడ్డాలతో ముఖాలు పాలిపోయి, యవ్వనమంతా క్షీణించి నడివయసును దాటినట్టు వున్నారు. అక్కడి అందరి వదనాల్లోనూ విచారం నిండుకుని వుంది.

ఓ విషాదం నిశ్శబ్దాన్ని పెనవేసుకుని స్పష్టంగా ఏర్పరచుకొని వుందక్కడ. వారిమధ్య 'అతడు' లేని లోటు స్పష్టంగా గోచరిస్తున్నది.

ఉదయం కెప్టెన్ హరిసింగ్ అధ్వర్యంలో ఆరుగురు జవాన్లు గల బృందం గస్తీ కోసమని బయలుదేరింది. దారిలో 200 మీటర్ల పొడవైన మంచుపెళ్ల తెల్లని భూతంలా విరుచుకుపడింది. అదృష్టం హరిసింగ్ వైపు నిలవటంతో, అతను మంచులో కూరుకుపోకుండా తల పైకెత్తి ఉంచడం వలన ప్రాణాలు కాపాడుకోగలిగాడు.

తనని కప్పేసిన మంచుని గంటల తరబడి వట్టిచేతులతోనే తవ్వుకుంటూ ఆ మహాసమాధి నుండి బయటపడగలిగాడు. ఆ ప్రయత్నంలో అతని రెండు చేతులు మంచు తిమ్మిరికి గురయ్యాయి. అయినా తోటి సైనికులను కాపాడగలిగాడు. కాని ఎంత ప్రయత్నించినా కిషన్‌రామ్ 'గాగుల్స్' తప్ప అతని జాడ ఎంతకూ దొరకలేదు. మంచు కరిగే కాలంలోగాని మళ్లీ అతని మృతదేహం కోసం గాలింపు సాధ్యపడదు.

కిషన్‌రామ్ చలాకీ వ్యక్తి. నేను ఇక్కడకు వచ్చిన మరుక్షణమే నన్ను ఆకర్షించిన మొదటి జవాన్ అతను.

కిషన్‌రామ్‌లో మంచి కమేడియన్ వున్నాడు. అతను ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూంటాడు. అలాంటి స్వభావం పుట్టుకతో ఏ కొందరికోగాని లభించదు.

కార్గిల్ కొండల్లో డ్యూటీ చేయటం అనేది మృత్యువుతో పరాచికాలాడటం లాంటిది. ఇక్కడ మనిషికి ముందు మతి పోతుందో, ప్రాణం పోతుందో తెలియని పరిస్థితి.

ఎంత వద్దనుకున్నా ఒంటరితనం, చలి, విసుగుదల, మనోవ్యథ మనిషిని వెంటాడి వేధిస్తాయి. దానికి తోడు చలిగాలి మనిషిని స్థిమితంగా వుండనీయదు. శత్రువు నుండి దూసుకొచ్చే బుల్లెట్ కంటే ఇది అతి ప్రమాదకరమైనది. ఇక్కడ శత్రువును గెలవచ్చేమోగాని ప్రకృతిని గెలవటం కష్టసాధ్యమైన పని. అలాంటిది అన్నిటినీ అధిగమించి ఆ బంకర్‌లో సైనికులంతా ఎంతో ఉషారుగా, ఉల్లాసంగా వుండటానికి కారణం కిషన్‌రామ్ అని నిక్కచ్చిగా చెప్పొచ్చు. అతను పండించే హాస్యంలో ఏ చిరాకూ దరిచేరదు. అతని అంతర్ధానం అక్కడ ప్రతి సైనికుడి మీదా చాలా ప్రభావం చూపించింది.

కప్పులో టీ పోసి అందించాడు జవాన్ లాన్స్‌నాయక్. దాన్ని గబగబ తాగాల్సిందే. ఇంట్లోలాగా నిదానంగా తాగాలనుకుంటే కనీసం ఒక్కసారి కూడా సిప్ చేయలేము. చూస్తుండగానే టీ చల్లబడి గడ్డకట్టుకుపోతుంది. ఇక్కడ ప్రతిదీ ఇంతే- టూత్‌పేస్ట్, షేవింగ్ క్రీమ్‌లను మరిగే నీటిలో పెడితేగాని పనిచేయవు. కోడిగుడ్లు గోల్ఫ్ బంతుల్లా గట్టిపడతాయి. తాజా కూరగాయలనేవి అందని వైభోగమే. ఇక్కడ చాక్లెట్స్ నిత్యావసర ఆహారం. కాని వాటిని స్టవ్‌పై వేడిచేస్తేగాని మెత్తపడదు.

"హరిచంద్రగారూ... ఇంట్లో వదినగారు పొద్దున్నే బెడ్ కాఫీ అందించినట్టు, ఇక్కడ టీలో రంగు, రుచి, చిక్కదనం వుండదు. గంజినీళ్ళలా వున్నా, 'అబ్బో...సూపరు' అనుకుంటూ గబుక్కున తాగేయాలి" పొద్దున కిషన్‌రామ్ అన్న మాటలు గుర్తొచ్చాయి.

నా గుండెను ఎవరో పిండినట్టయింది. టీ త్రాగి బంకర్‌లోంచి బయటికి వచ్చాను. మంచు కురవటం ఆగిపోయింది. ఒక్కసారి నాలో ప్రాణం లేచివచ్చింది. ప్రకృతి ఇలాగే నిర్మలంగా వుంటే రేపు ఉదయం తప్పకుండా హెలికాప్టర్ వస్తుంది. ఇక తను ఇంటికి వెళ్లిపోవచ్చు. జ్వరంతో బాధపడుతున్న జవాన్ కేదార్ యాదవ్‌ను ఆసుపత్రికి తరలించవచ్చును.

గడియారం కేసి చూశాను. రాత్రి 11 గంటలు దాటింది. ఆకాశంలోకి వచ్చిన చంద్రుడు తెల్లని దేవతా వస్త్రం చుట్టిన పెద్ద బంతిలా అగుపిస్తున్నాడు. ఆకాశం చాలా నిర్మలంగా వుంది. తెల్లని మబ్బులు నన్ను తాకుతూ వెళుతున్నాయి. కురుస్తున్న తెల్లని వెన్నెల్లో మంచు శిఖరాలు వెండికొండల్లా కనిపిస్తున్నాయి. సప్తవర్ణాల సమ్మేళనంతో తళుక్కున మెరుస్తున్న నక్షత్రాలని నిచ్చెన వేసుకుని ఎంచక్కా పువ్వుల్లా కోసుకోవచ్చన్న భ్రమను కలిగిస్తున్నాయి. ప్రకృతి ఎంతో రమణీయంగా వుండి నేను 'ఆకాశవీధి'లో విహరిస్తున్నానేమో అన్న అనుభూతిని కలిగించింది. ఘనీభవించిన అక్కడి ప్రశాంతత సంవత్సరం క్రితం అక్కడ పారిన రక్తపుటేరుల గురించి తనకేమీ తెలియదన్నట్టు నంగనాచిలా వుంది.

ఆ తీయటి అనుభూతి నాలో ఎంతోసేపు నిలవలేదు. చూస్తుండగానే వాతావరణం మారిపోయింది. మంచు కురవటం మొదలైంది. ఒక్కసారిగా నా మనను మళ్లీ దిగులుకు గురయింది. చలిగాలి రివ్వున వీస్తూ మృత్యువు ఏడుపులా వినిపించసాగింది.

ఆ మంచు వర్షంలోనూ శ్రీనునాయక్ అనే జవాన్ ఎంతో ఏకాగ్రతతోనూ, అప్రమత్తంగానూ, రణసన్నద్ధంగానూ నిల్చుని వున్నాడు.

అక్కడికి సరిహద్దు కేవలం 25 మీటర్ల దూరంలోనే వుంది. అవతల పాకిస్తాన్ బంకర్‌లో... పొద్దుటిపూట వారి ప్రతి కదలిక మాకు స్పష్టంగా తెలుస్తుంది. శత్రువు నుండి ఎలాంటి కవ్వింపు చర్యనైనా చాలా సులువుగా తిప్పికొట్టగలనన్న ఆత్మవిశ్వాసం మా జవాన్లలో ప్రస్ఫుటంగా కనబడుతుంది. కాని మాలో ఏకాగ్రతని అనుక్షణం ప్రకృతి భంగపరుస్తుంటుంది. గాలిలో ఆక్సిజన్ అందక మేం అప్పుడప్పుడు సతమతమవుతూంటాం. ఇక్కడ ఎప్పుడూ ఇంతే- తరచూ ఉష్ణోగ్రత 30 నుండి 40 మైనస్ డిగ్రీలకు పడిపోతుంటుంది.

ఇక్కడ ప్రతి సైనికుడు ఎప్పుడూ అప్రమత్తంగానే వుండాలి. శత్రువు ఎప్పుడు ప్రమాదాన్ని తలపెడతాడో తెలియదు. ప్రకృతి ఎప్పుడు ప్రళయాన్ని సృష్టిస్తుందో అంతకంటే తెలియదు. తెలిసినా శత్రువును శాసించవచ్చేమో గాని ప్రకృతిని శాసించలేముగదా?


నేను పరధ్యానంగా వుండటాన్ని శ్రీనునాయక్ చాలాసేపటినుండి గమనిస్తున్నట్టున్నాడు.

"ఇక్కడి పరిస్థితులను చూస్తుంటే భయంగా వుందా?" అని అడిగాడు.

అతను నా ఫేస్ ఫీలింగ్స్‌ని అంత ఖచ్చితంగా చదివినట్టు సూటిగా అడిగేసరికి నాకు ఇబ్బందిగా అనిపించింది. అబద్ధం చెప్పలేకపోయాను.

"ఒక జర్నలిస్టుకి తెలివి, తెగువ, సా సం, చలాకీ తనం, సమయస్ఫూర్తి వుండాలంటారు. వన్నీ నాలో పుష్కలంగా వున్నాయనుకునేవాడిని. కా ఇక్కడకు వచ్చాక తెలిసింది- నేను చాలా పిరికివాడి .

నేను ఇక్కడికి వచ్చి 24 గంటలు వకముందే మంచు తిమ్మిరి నా చేతిని కమ్మేసింది. షాక్ నుండి తేరుకోకముందే కేదార్ యాదవ్ జవాన్ ్వరానికి గురై చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టా తున్నాడు. ఆ సంఘటనలోంచి ఇంకా తెప్పరిల్లకముందే ఉదయం హిమపాతం ప్రళయం సృష్టించి కిషన్‌రామ్ హిమసమాధి అయ్యాడు.



ఇక్కడ పాదాలక్రింద పాక్ సైన్యం పాతిపెట్టి వెళ్లిన మందు పాతరల ఎప్పుడు పేలుతాయో తెలియదు. హి ం పాతం ఎప్పుడు ముంచుకొస్తుందో తెలి దు. ప్రకృతి ఎప్పుడు ప్రళయాన్ని సృష్టిస్తు అంత కంటే తెలియదు. అసలు ఇక్కడ ఎప్పు ఏం జరుగుతుందో తెలియటం లేదు. ఇక్క పరిస్థితిని చూస్తుంటే కొన్ని సౌకర్యాలతో ఏకాంత ర్బంధంలా గోచరిస్తుంది.

రెండురోజుల్లో వస్తానని ఇంట్లో చెప్పా . నేను ఇక్కడికి వచ్చి అప్పుడే వారం రో లు అయింది. ఈ ప్రకృతి వాలకం చూస్ టే మంచు కురవటం ఆగేలా లేదు. హెలిక ర్ ఇక్కడికి వచ్చేలా లేదు. నేను వెళ్లేలా లే . ఇక్కడి పరిసరాలను చూస్తుంటే ప్రాణ తో ఇంటికి వెళ్లగలనా? అన్న సందేహం నాలో భ న్ని ఉసిగొల్పింది. 'కార్గిల్‌లో సైనికుల జీవితాలు' నే ఆర్టికల్ రాయడాన్ని ఎందుకు ఎంచుకున్నానా నిపిస్తున్నది నాకిప్పుడు. ఇక్కడినుండి ఎంత తొందర బయటపడదామా అన్న ఆలోచన నన్ను పిచ్చివా చేస్తున్నది. బోసి నవ్వులతో తప్పటడుగులు వేసే కొడుకు రుషికేష్ పదే పదే గుర్తుకొస్తూ నన్ను మి తంగా వుండనీయటం లేదు. నాకు తెలియకుండానే నా గొంతు వణికింది.

అతను నా భుజాన్ని అనునయంగా తట్టాడు. "వారం రోజులు కాదు, ఒక్కోసారి ఇరవై రోజులు కూడా మంచు నిర్విరా ంగా కురుస్తూనే వుంటుంది హరిశ్చంద్రా! కాని మీ బెంగపడకండి. మరో రెండురోజుల్లో మంచు కు టం ఆగిపోతుందని నా బలమైన నమ్మకం. అది న అనుభవం" అన్నాడు.

అతని మాటలు నాకు కొంత ఊరట ిగించాయి. మళ్లీ అతనే కొనసాగించాడు.

"వారం రోజులకే నువ్వు ఇంతగా ఇ ్లో వారికోసం బెంగపడిపోతున్నావే, ఇక్కడ సైన్యంలో ఒక్కొక్కరి పరిస్థితి ఒక్కోరకంగా వుంటుంది. పెళ్లయిన రెండువారాలకే నేను డ్యూటీలో చేరాల్సివచ్చింది. పెళ్ళయి అప్పుడే ఏనిమిది నెలలు దాటింది. సమయానికి ఇంటికి చేరుకోలేని ఒక సైనికుడి పెళ్లి, అతను లేకుండానే కేవలం అతని ఫొటోతో జరిగిన సందర్భం వుంది. తల్లిని కడసారి చూడలేని సైనికుడు వున్నాడు. చెల్లెలి పెళ్లిని చూడనివాడు కూడా వున్నాడు. కూతురు శ్రీమంతం చూడనివాడూ వున్నాడు. కన్న తండ్రికి తలకొరివి పెట్టలేనివాడూ వున్నాడు. ఇలా చెప్పుకుంటూ వెళితే ప్రతి సైనికుడి మనసులో నిర్వేదం నిక్షిప్తమై వుంటుంది."

అతని మాటలు నా హృదయంలోంచి సూటిగా దూసుకెళ్లాయి. ఒక సైనికుడి శ్రమ, త్యాగం ముందు ఒక సాటి మనిషి త్యాగం, శ్రమ ఏపాటిది? అనిపించింది. నా ప్రవర్తన సిల్లీగా తోచి సిగ్గేసింది. తరువాత నా మనసు ఎంతగానో కుదుటపడింది.

నిద్రకు ఉపక్రమించాను. కాని ఎంత ప్రయత్నించినా కునుకు రావటం లేదు. స్లీపింగ్ బ్యాగ్ ఇస్తున్న వెచ్చదనాన్ని చలి డామినేట్ చేస్తున్నది. నన్ను ఇబ్బంది పెడుతున్నది చలి కాదు, జ్వరంతో కేదార్ యాదవ్ జవాన్ చేస్తున్న మూలుగులు. కళ్ళముందర కిషన్‌రామ్ రూపం... ఇందాక శ్రీనునాయక్ అన్నమాటలు పదే పదే గుర్తుకొస్తూ నా మనసును కందిరీగల్లా తొలిచివేస్తున్నాయి. అప్పటివరకు నన్ను వేధిస్తూ వచ్చిన ఒక సందేహం విడిపోయి స్పష్టమైన అభిప్రాయాన్ని కలిగించింది.

ఒక రాజకీయ నాయకుడు గొప్పవాడా? లేక సైనికుడు గొప్పవాడా? అని నన్ను ఇప్పుడు ఎవరైనా అడిగితే సైనికుడే గొప్పవాడు అంటాను.

ఒక రాజకీయ నాయకుడు గూండాలను, రౌడీలను పెంచి పోషిస్తున్నాడు. ఎలక్షన్స్‌లో రిగ్గింగ్ చేయిస్తున్నాడు. బ్యాలెట్ బాక్స్‌ల అపహరణ చేస్తున్నాడు. కుంభకోణాలు చేస్తున్నాడు. హత్యలు చేయిస్తున్నాడు. మతకలహాలను సృష్టిస్తున్నాడు. సంఘవిద్రోహ శక్తు

వనితరాజు

లకు సహకరిస్తున్నాడు. ఆరాచకాలు సృష్టిస్తున్నాడు. ఈ దేశంలో అశాంతికి మూలకారకుడవుతున్నాడు. అయినా ఇన్నీ చేసినా... అన్నీ అలవెన్సులు కలుపుకుని నెలకు పాతికవేల వరకు వేతనాలు, రాజమర్యాదలు! కారు, బంగ్లా, పిఏ, సెక్యూరిటీ, విందులు వినోదాలు. ఖర్మకాలి చస్తే వాడికి సంతాప సభలు, దేశానికి సెలవులు, ప్రాజెక్టులకు, రోడ్లకు వాడి పేరున నామకరణాలు, నాలుగురోడ్ల కూడలిలో నిలువెత్తు విగ్రహాలు.

అదే ఒక సైనికుడు 'నా అనేవాళ్లందరికీ దూరంగా ఎడారుల్లో, మంచుకొండల్లో ప్రతిక్షణం మృత్యువును ఒక కంట కనిపెడుతూ మరోవైపు శత్రువు కదలికలను గమనిస్తూ... అనుక్షణం సరిహద్దులను కాపాడుతూ, సరైన ఆహారం లభించకపోయినా, అలసట అంటే ఏమిటో తెలియకుండా రోజుకు ఇరవై నాలుగు గంటలు శ్రమిస్తుంటే ఎందుకూ సరితూగని వేతనాలు ఇస్తున్నారు. ఈ దేశంలో ఆమాత్రం శాంతిభద్రతలు మిగిలి వున్నాయంటే దానికి మూలకారణం సైనికుల ప్రాణత్యాగాలే కారణమనేది నిర్వివాదాంశం. ఒక సైనికుడికంటే ప్రభుత్వ హాస్పిటల్‌లోని వార్డుబాయ్ మెరుగైన జీవితాన్ని కొనసాగిస్తున్నాడు.

నిజంగా ఒక సైనికుడి మనుగడ ఎంత దురదృష్టకరమైనది. ఒక రాజకీయ నాయకుడు మన ఊరికి వస్తున్నాడంటే వాడికోసం మైకులు, స్టేజీలు, తోరణాలు కడతాం. వాడి రాకకోసం గంటల తరబడి ఎండనకా, వాననకా ఎదురుచూస్తూ వుంటాము. అదే ఒక సైనికుడు కనబడితే కనీస గౌరవం కోసం సెల్యూట్ కూడా చేయం. ఇది ఎంతో అవమానకరమైన విషయం.

'మా ప్రాణత్యాగం బూడిదలో పోసిన పన్నీరవుతుంది. పదవుల కోసం రాజకీయ నాయకులు ఆడుకుంటున్న చదరంగంలో మేము పావులవుతున్నాము. మేము ఎందుకు ప్రాణాలను త్యాగాలు చేయాలి? మేము కూడా అందరిలాగే ఎంచక్కా తల్లిదండ్రుల సమక్షంలో, భార్యా పిల్లలతో కలిసి ఎంజాయ్ చేస్తూ బ్రతుకుతాము. ఈ దేశం పట్ల ఎవరికీ లేని పట్టింపు మాకెందుకు?' అని విసిగి వేసారిపోయిన సైనికుడి చిన్న ఆలోచనే శ్రీలంకలో పదిహేను వేలమంది సైనికులు చెప్పాపెట్టకుండా సైన్యంనుంచి పారిపోవడానికి కారణమైంది. అదే పరిస్థితి ఈ దేశంలో ఉత్పన్నమైతే...?

ఆపైన ఊహించుకోడానికే నాకు ధైర్యం చాలలేదు. ఒక్కసారిగా నా రోమాలు శరీరమంతా ఉద్వేగంతో నిక్కబొడిచాయి.

బంకర్‌లో హడావిడి వినబడింది. ఆలోచనలోంచి తెప్పరిల్లాను. స్లీపింగ్ బ్యాగ్ తెరుచుకుని బయటికి వచ్చాను. ఎదురుగా కనబడిన దృశ్యానికి ఒక్కసారిగా స్థాణువయ్యాను.

జరిగిందేమిటో మనసులో జీర్ణమవటానికి ఎంతోసేపు పట్టలేదు. కేదార్ యాదవ్ బంకర్ పైభాగానికేసి నిస్తేజంగా చూస్తున్నాడు. అతని చుట్టూ జవానులంతా విచారం నిండిన వదనంతో తల దించుకుని వున్నారు. ఇక్కడ మృత్యువు కౌగిలి షరామామూలే. కాని ఆ తరువాత ఎవరి వంతన్నది జవాబు తెలియని ప్రశ్న.

నేను నిలువునా కంపించాను. అతని మరణానికి కారకులు ఎవరూ కాదు- ప్రకృతి. వాతావరణం అనుకూలంగా వుండి వుంటే హెలికాప్టర్ వచ్చి అతడ్ని హాస్పిటల్‌కు తరలించి వుండేది. అతను బ్రతికి వుండేవాడు.

నాకు ఏడుపు వచ్చింది. దుఃఖం ఆపుకునే శక్తి నాకు సహకరించలేదు. బంకర్‌లోంచి బయటికి వచ్చేశాను. కనికరం చూపని ప్రకృతి మీద ఉన్మాదంతో కూడిన ఆవేశం పొంగుకొచ్చింది. నిస్సహాయంగా మంచులో కూలబడి బోరున ఏడ్చేస్తుంటే కనుకొనలను దాటిన కన్నీళ్లు మైనస్ 40 డిగ్రీల చలిలో బుగ్గలమీద ఘనీభవిస్తున్నాయి.

★ ★ ★

దడదడమని శబ్దం చేస్తూ హెలికాప్టర్ పాయింట్ 5240 శిఖరం మీంచి ఆకాశంలోకి లేచింది. నా మనసంతా తుఫాన్ సృష్టించిన ప్రళయంలో మిగిలిన విషాదంలా వుంది. బంకర్ ముందు నిల్చున్న జవానులంతా నాకేసి గాలిలో చేతులు వూపుతున్నారు వీడ్కోలుగా.

నేనూ నిస్తేజంగానే చేతులు వూపాను. కాని వాళ్ళందరిని వదిలేసి వస్తుంటే నాకెంతగానో బాధగా అనిపించింది. ఆత్మీయులందరిని వదిలేసి ఎక్కడికో దూరంగా వెళ్లిపోతున్నాననీ ఫీలింగ్ కలిగింది. చూస్తుండగానే శిఖరం చాటున అందరూ అదృశ్యమయ్యారు.

నా ప్రక్కనే వున్న కేదార్ యాదవ్ డెడ్‌బాడీ కేసి చూశాను. యుద్ధభూమిలో శత్రువులకు ఊపిరి సలపనీయని యోధుడు ప్రకృతితో జరిగిన పోరులో అలసటకు గురైనవాడిలా ఆదమరచి నిద్రపోతున్నట్టుగా వున్నాడు.

అతడ్ని స్పృశించాను. నా శరీరం ఎంతో ఉద్వేగానికి లోనయింది. మనసు కృతజ్ఞత కూడిన భావంతో ఎలుగెత్తి అరిచింది-

'ఓ నా దేశ సోదర వీర జవానుల్లారా... మీ త్యాగం అపారమైనది, ఏమిచ్చి మీ రుణం తీర్చుకోమంటారు? మంచుకొండల్లో ఊపిరి అందక మీరు ఉక్కిరి బిక్కిరి అవుతుంటే మా ఊపిరి మీకు పోసి రుణం తీర్చుకోమంటారా? ఎడారుల్లో దాహంతో నాలుక పిడచకట్టుకు పోతుంటే మా రక్తాన్ని నీరుగా అందించి రుణం తీర్చుకోమంటారా? లేక శత్రువు తూటాలు మృత్యువు నాలుకలై చాచుకుని వస్తుంటే కర్ణుడి కవచకుండలాల్లా మిమ్మల్ని పెనవేసుకుని రుణం తీర్చుకోమంటారా? ఎంత చేసినా మీ త్యాగాల ముందు అది స్వల్పమేకదా! మీరు కనబడని ఆ దేవుళ్ళ కంటే గొప్పవాళ్ళు. అందుకే మీ పాదాలకు వంగి నమస్కారాలు చేస్తున్నాము. అందుకోండి ఓ వీర జవాన్ సోదరుల్లారా మా వందనాలు... పరి పరి దండాలు.'

నా చేతులు అతని పాదాలను అపురూపంగా స్పృశిస్తుంటే... హెలికాప్టర్ కార్గిల్ మంచుశిఖరాలను దాటుకుంటూ హెడ్‌క్వార్టర్స్ కేసి సాగిపోసాగింది. ●



**సల్మాన్ వెయిట్ లిఫ్టింగ్**

మాంచి వెయిట్ లిఫ్టర్‌లా వున్నాడు కదా! ఒలింపిక్స్‌కి పంపిస్తే బాగుంటుందేమో!

-గీతా శ్రీనివాస్